క్లుప్తంగా

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గజపతినగరం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండల స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'ఆడబిడ్డను రక్షిద్దాం' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలను నిర్వహించినట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని, విజేతలకు అంతర్జాతీయ బాలికల దినోత్సవం రోజున నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సాయిచక్రధర్, ఉపాధ్యాయులు సీహెచ్ నాగసింహాచలం, సంతోష్, సీహెచ్ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

విచారణ



వివరాలు సేకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో మండలంలోని కొత్తశ్రీరంగ రాజపురం పోలింగ్ కేంద్రం 100లో పీఓగా పని చేసిన వాసిరెడ్డి రాంబాబు పనితీరుపై అదే గ్రామానికి చెందిన యజ్జిరోతు చిన్నంనాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(తోటపల్లి బ్యారేజీ యూనిట్–3) పి.మురళీకృష్ణ శుక్రవారం విచారణ చేపట్టినట్లు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి అందజేయనున్నట్లు చెప్పారు.

180 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో విజయనగరం శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నరాలు, ఎముకలు, కీళ్లనొప్పులు, నడుం నొప్పి, స్త్రీలకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న 180 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ దీపిక, స్థానిక సర్పంచ్ గొటివాడ దాసు, గ్రామ పెద్దలు కనిమొరక తిరుపతినాయుడు, గాడి అప్పలనాయుడు, బల్లిరెడ్డి రామ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ప్రదర్శన



ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట: మండలంలోని భవానీనగర్ శ్రీగౌరీ విద్యానికేతన్ స్కూల్‌లో శుక్రవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ నర్సింగరావు ప్రారంభించారు. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు తమ పాఠ్యాంశాలపై వివిధ ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఎంఈఓతో పాటు మాజీ ఎమ్మెల్సీ రఘురాజు వాటిని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సబ్జెక్టు పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి కృత్యాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



గోడపత్రికలను ఆవిష్కరించిన వన్ స్టాఫ్ కౌన్సిలర్ రమాదేవి, తదితరులు

వేపాడ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలను ప్రోత్సహించే వ్యక్తులపై లక్ష రూపాయల జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం వన్‌స్టాఫ్ కౌన్సెలర్ కె.రమాదేవి, కమ్యూనిటీ సోషల్ వర్కర్ సీహెచ్ పద్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎఫ్ఐఆర్ నమోదు, న్యాయ సహాయం, కౌన్సిలింగ్, వైద్య సదుపాయం, అత్యవసర స్పందన, రక్షణ సేవలు, వైద్య, న్యాయ పరమైన సహాయం ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కామేశ్వరి, భాగ్యవతి పాల్గొన్నారు.

మత్తుకు వ్యతిరేకంగా 'సంకల్పం'



చీపురుపల్లి: మూడు రోడ్ల జంక్షన్‌లో 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీఐ



గుర్ల: కళాశాలలో ఫిర్యాదు పెట్టెను ఏర్పాటు చేస్తున్న డీఎస్పీ రాఘువులు



జామి: కళాశాలలో ఫిర్యాదులు పెట్టెను ఏర్పాటు చేస్తున్న సీఐ రవికుమార్

గుర్ల: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘువులు సూచించారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని తెలియజేయాలని కోరారు. కళాశాలలో ఫిర్యాదుల పెట్టును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐ శంకరరావు, ఎస్ఐ నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

మత్తులో జీవితాన్ని చిత్తు చేసుకోవద్దు

జామి: యువత మత్తుపదార్థాలకు బానిసలైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ రవికుమార్ అన్నారు. భీమసింగి బాలాజీ కళాశాలలో శుక్రవారం ఎస్ఐ వీరజనార్దన్ ఆధ్వర్యంలో 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో జీవితం నాశనం అవడమే కాకుండా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయన్నారు. డ్రగ్స్ సేవించినా, విక్రయించిన కేసులు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ, ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైద్యాధికారి శైలజ, తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: ఎం.గుమడాం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కె.లక్ష్మణరావు

మత్తుకు వ్యతిరేకంగా సంకల్పం తీసుకోవాలి

చీపురుపల్లి: జీవితాలను నాశనం చేసే మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామంటూ సమాజంలో ఉండే ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శంకరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో శుక్రవారం 'సంకల్పం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటానికి సంబంధించిన ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని కోరారు. ఇటీవల కాలంలో గంజాయి వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. గంజాయి వినియోగంతో ఎంతో విలువైన జీవితం నాశనమైపోతుందన్నారు. అంతేకాకుండా గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గజపతినగరం: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై కె.లక్ష్మణరావు సూచించారు. మండలంలోని ఎం.గుమడాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహనా లోపంతో యువత గంజాయి, మద్యం, గుట్కా, ఖైనీ, తదితర మత్తుపానీయాలకు అలవాటుపడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని కోరారు. వాటిని సేవించినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



గ్రామ సచివాలయాన్ని సందర్శించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

గజపతినగరం: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని వృత్తి విద్యకోర్సు శిక్షకులు సంతోష్, చిరంజీవి సూచించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మరుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గ్రామ సచివాలయంలో శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రానునున్న రోజుల్లో అన్ని పనులు డిజిటల్ విధానంలో జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు, గుర్తింపు పత్రాలు ప్రజలకు ఏ విధంగా చేరుతున్నాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ గెద్ద ఈశ్వరరావు, గ్రామ సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..



కొత్తవలస: హెచ్‌ఎంకు చెక్కును అందజేస్తున్న విద్యార్థులు, గైడ్ టీచర్లు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం రూ.16,365లు సేకరించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను పాఠశాల హెచ్ఎం వి.అరుణకుమార్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గైడ్ టీచర్లు సీహెచ్.అమరావతి, బి.నర్సింహనాయుడు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులైన టైలర్ల సహాయార్థం..

శృంగవరపుకోట: ఇటీవల విజయవాడ వరదల్లో చిక్కుకుని నిరాశ్రయులైన టైలర్ల సహాయార్థం నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.సూర్యారావు నేతృత్వంలో శుక్రవారం పట్టణంలో పలువురు టైలర్లు విరాళాలు సేకరించారు. మొత్తం రూ.8200లు సేకరించారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకోటేశ్వరరావుకు పంపనున్నట్టు సూర్యారావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ పి.వి.రమణారావు, ఎస్.తాతారావు, బి.అప్పారావు,ఎం.నాగమణి, కె.నాగమణి పాల్గొన్నారు.



ఎస్.కోటలో విరాళాలు సేకరిస్తున్న టైలర్లు


నాణ్యమైన బోధన అందించాలి



హెచ్ఎం సూరిదముడును సన్మానిస్తున్న డిప్యూటీ ఈఓ బి.వి.రమణ, ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలో బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విజయనగరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బి.వి.రమణ శుక్రవారం సందర్శించారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు బోధనపై సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న వీరానారాయణ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సూరిదేముడును సన్మానించారు. కార్యక్రమంలో వేపాడ, సోంపురం, గొల్జాం, వీరనారాయణ, తదితర పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 నుంచి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్



లక్కవరపుకోట: స్కూల్ గేమ్స్ పోటీల నిర్వహణపై ఎమ్మెల్యేతో చర్చిస్తున్న క్రీడా కోఆర్డినేటర్లు

లక్కవరపుకోట: ఈ నెల 30, అక్టోబర్ 1వ తేదీల్లో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ పి.శ్రీరాములు తెలిపారు. ఐదు మండలాలకు చెందిన క్రీడా కోఆర్డినేటర్లు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని ఆమె క్యాంప్ కార్యాలయంలో కలిసి పోటీల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ పి.శ్రీరాములు మాట్లాడుతూ.. కొత్తవలస మండల ప్రగతి డిఫెన్స్ అకాడమీ మైదానంలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 900 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈనెల 30న బాలికలకు, అక్టోబర్ 1న బాలురలకు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా, చదరంగం, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. విజేతలు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు జి.లక్ష్మణరావు, వివిధ మండలాల క్రీడా కోఆర్డినేటర్లు వెంకటరావు, డి.ప్రసాద్, ఆర్.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ శుక్రవారంతో ముగిశాయి. అండర్–14, అండర్–17 విభాగాల్లో వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, యోగా తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

నిమజ్జనంలో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు

● సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు

చీపురుపల్లి: వినాయక నిమజ్జనోత్సవాల్లో యువత అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శంకరరావు హెచ్చరించారు. పట్టణంలోని జి.అగ్రహారంలో వినాయక ఉత్సవ కమిటీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో ఆధ్యాత్మికంగా జరగాలి తప్ప ఎలాంటి గొడవులు, అల్లర్లు జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రధానంగా ఉత్సవ కమిటీలు గొడవలు జరగకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీలపై ముందుగానే బైండోవర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఊరేగింపు కార్యక్రమాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని స్పష్టం చేశారు. అంతేకాకుండా నిబంధనలకు లోబడి డిజే సౌండ్ సిస్టమ్‌లు వినియోగించాలన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో వల్లంపూడి ఎస్సై బి.దేవి నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన మహిళ వద్ద ఆరు మద్యం బాటిళ్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో సారా తయారుచేసిన, విక్రయించిన, అనుమతుల్లేకుండా మద్యం విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు



జగ్గయ్యపేట గ్రామసభలో మాట్లాడుతున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలో జగ్గయ్యపేట, ఆకులసీతంపేట గ్రామాల్లో ఎంఈఓ బాలభాస్కరరావు ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర 2047' గ్రామసభలు శుక్రవారం నిర్వహించారు. గ్రామ పెద్దలు, సర్పంచ్‌ల సమక్షంలో గ్రామాభివృద్ధిపై సమీక్షించారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయటం, ప్రస్తుతం ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన ప్రణాళికలపై చర్చించారు. స్వర్ణాంధ్ర విజన్, వికసిత్ భారత్, తదితర అంశాలపై చర్చించారు.

శుభదిన భోజనం



విద్యార్థులకు భోజనం పెడుతున్న దృశ్యం

జామి: మండలంలోని శాసనాపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 'శుభదిన్ భోజన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన వలసెట్టి సతీస్ తన సోదరుడి కుమార్తె సాహితీ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం పిల్లలకు చాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వర్రి పైడపునాయుడు, ఉపాధ్యాయులు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేద్దాం రండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ప్రపంచ వ్యాప్తంగా అత్యంత పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూ విషయంలో రాజకీయ పాపం చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను ప్రక్షాళన చేసేందుకు ఆలయాల్లో తలపెట్టిన పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయం కోసం తిరుపతి లడ్డూను అడ్డం పెట్టుకోవడం దారుణమన్నారు. అందుకనే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ఆంజనేయపురంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాప ప్రక్షాళన పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ పూజా కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

దత్తి వేంకటేశ్వర ఆలయంలో..

దత్తిరాజేరు: చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయాలని దత్తి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున తెలిపారు. వేంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను పాడుచేసేందుకు రాజకీయ దురుద్దేశంతో అసత్యాలు ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.

ఆర్థిక సహకారం



సీహెచ్‌సీలో రోగులకు భోజనం అందజేస్తున్న గద్దే బాబూరావు

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో నిర్వహిస్తున్న శాశ్వత అమృత హస్తం పథకానికి పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ రాష్ట్ర మెంబర్ గద్దే బాబూరావు రూ.10 వేలు ఆర్థిక సహకారం చేశారు. సీహెచ్‌సీలో శాశ్వత అమృత హస్తం పథకాన్ని శుక్రవారం పరిశీలించి రోగులకు భోజనం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల కోసం అమలు చేస్తున్న ఈ పథకం ఎంతో గొప్పదన్నారు. ఈ పథకం నిర్వహణకు తనవంతు సహకారం అందించడంతో పాటు దాతల నుంచి ఆర్థిక సహకారం అందేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో పథక నిర్వాహకులు బీవీ గోవిందరాజులు, నారాయణరావు, వి.మోహనరావు, గొర్లె పద్మావతి, కృష్ణమూర్తిల, గవిడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న దళిత సంఘ నాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): కాకినాడ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డా.ఉమామహేశ్వరరావుపై దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించిన కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా తాత్సారం చేయటంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కనిపిస్తోందని జిల్లా జైభీమ్ దళితసంఘ నాయకులు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దళిత వ్యక్తిని దూషించిన ఎమ్మెల్యే చట్టసభలకు అర్హుడు కాదని భావిస్తున్నామన్నారు. మెడికల్ విద్యార్థులు, దళిత సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేసినప్పటికీ ఎమ్మెల్యే పంతం నానాజీపై కేసు నమోదు చేయకపోవటం దారుణమన్నారు. అదే విధంగా అంబేడ్కర్ ఫెక్సీలను చించేసి ఆయన్ను అవమానపరిచిన ఎమ్మెల్యే రఘురామరాజుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బసవ సూర్యనారాయణ, గుంటుబారిక లక్ష్మణ, ఎత్తుల ఈశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం ఆకస్మిక తనిఖీ



వసతి గృహం సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి విజయకళ్యాణి

శృంగవరపుకోట: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి శుక్రవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు ఆస్పత్రి పాలైనట్లు పత్రికల్లో వచ్చిన వార్తలపై జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి బి.సాయి కళ్యాణచక్రవర్తి స్పందించారు. తక్షణమే వసతి గృహాన్ని తనిఖీ చేసి వాస్తవాలు పరిశీలించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణిని ఆదేశించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం తనిఖీలు చేపట్టారు. వసతి గృహం పరిసరాలు, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురవడానికి గల కారణాలపై వార్డెన్‌తో మాట్లాడారు. వారికి అందించిన వైద్యసేవలపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.నీల వద్ద ఆరాతీశారు. తక్షణమే పట్టణంలోని అన్ని వసతి గృహాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, మెరుగైన వసతి, రక్షిత తాగునీరు, కచ్చితమైన మెనూ అమలయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ, రెవెన్యూ, విద్య, వైద్యారోగ్య, ఆర్.డబ్ల్యూఎస్ వంటి శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. అనంతరం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచిత న్యాయ సహాయంపై ఆరా తీశారు. ఆమె వెంట స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎస్.వాణి, తహసీల్దార్ అరుణ కుమారి, స్థానిక న్యాయవాదులు ఉన్నారు.

పోషకాహార మాసోత్సవాలు



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ ఉమాదేవి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్లు కామేశ్వరి, భాగ్యవతి నేతృత్వంలో మండల స్థాయి పోషకాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తయారుచేసిన వివిధ రకాల వంటలను ప్రదర్శించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గర్భిణులకు వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు సన్యాసినాయుడు, వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి, ఆర్ఐ రామలక్ష్మి, సీహెచ్ఓ ఆంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం షెడ్ ధ్వంసం



ధ్వంసమైన చెత్త సంపద కేంద్రం

జామి: మండలంలోని రామయ్యపాలెంలో ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామ సర్పంచ్ పాటూరు మణిమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గ్రామానికి చెందిన కొందరు ధ్వంసం చేసినట్లు చెప్పారు. దీనిపై ఎంపీడీఓ సతీష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కరువైందని, ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయాలని కోరారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన సాధ్యం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నేచర్ సంస్థ సభ్యులు

శృంగవరపుకోట: హెచ్ఐవీ బాధితుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ 2వ స్థానంలో ఉందని, హెచ్ఐవీ నిర్మూలన కోసం యువతలో అవగాహన పెంపొందించేందుకు కృషిచేయాలని ఆర్‌బీఎస్‌కే పీఓ వీవీబీ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్యశాఖ, యూనిసెఫ్ సౌజన్యంతో సీహెచ్ఓలకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రిప్రొడెక్టివ్, హెల్త్, ఎమోషనల్, వెల్‌బీయింగ్, పోషకాహారం, హింస, రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ విద్య మాట్లాడుతూ కిశోరీ బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టెలీమెడిసన్, టెలీ కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. నేచర్ స్వచ్ఛంద సంస్థ సఖి ప్రోగ్రాం మేనేజర్ నిశిత మాట్లాడుతూ.. జిల్లాలో సఖి ప్రోగ్రాం క్రింద 482 మంది సీహెచ్ఓలకు 8 బ్యాచ్‌లలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అంగన్‌వాడీ, పాఠశాల స్థాయిల్లో 'సేఫ్ లైఫ్' క్యాంపెయిన్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేచర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుభాష్, కృష్ణ, ఎం.ప్రసాద్, చైతన్య, బంగారుబాబు, రామకృష్ణ, కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.